క్లుప్తంగా

నిబంధనల మేరకు ధాన్యం తేవాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

చేగుంట(తూప్రాన్): కొనుగోలు కేంద్రాలకు నిబంధనల మేరకు ధాన్యం తీసుకురావాలని రైతులకు తహసీల్దార్ నారాయణ సూచించారు. చేగుంట రైతు వేదికలో గురువారం క్లస్టర్ పరిధిలోని రైతులు ఐకేపీ సిబ్బందికి కొనుగోలుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తాలు లేకుండా జల్లి వేసిన ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకొస్తే కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఏఈఓ మాధవి, ఐకేపీ సీసీ స్వేత సిబ్బంది పాల్గొన్నారు.

పాపన్నపేట ఏడీఈగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట సబ్ డివిజన్ విద్యుత్‌శాఖ ఏడీఈగా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్ కార్యాలయంలో పనిచేసిన ఈయన.. ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఏడీఈ మోహన్‌బాబు మెదక్‌కు బదిలీ అయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని శ్రీనివాస్ ఈ సందర్భంగా చెప్పారు.

అక్రమ నిర్మాణాలు చేపట్టొద్దు



అక్రమ నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆర్ఐ సునీల్‌సింగ్ చౌహాన్ హెచ్చరించారు. గురువారం చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామంలోని సర్వే నంబర్ 2లో అక్రమంగా నిర్మించిన షెడ్డులు, కడీలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సైతం సర్వే నంబర్ -2 లో అక్రమ నిర్మాణాలు చేపడితే, వాటిని కూల్చేసి, నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ ఆపరేటర్ల ముందస్తు అరెస్టు



ఆపరేటర్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): విద్యుత్ సౌధకు తరలివెళ్లకుండా ఉండేందుకు మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గ్రామాలలో ఆపరేటర్ల ఇళ్ల వద్దకు వెళ్లిన పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మండలంలోని గవ్వలపల్లికి చెందిన రమేశ్‌గౌడ్, చిన్నశంకరంపేటకు చెందిన నర్సింహులు, అలాగే నార్సింగి, పలు గ్రామాలలోని విద్యుత్ ఆపరేటర్లను ముందస్తుగా అరెస్టు చేశారు.

గుండెపోటుతో పాస్టర్ మృతి



ఆనంద్

చిన్నశంకరంపేట(మెదక్): అనారోగ్యంతో అస్పత్రిలో చేరిన మండలంలోని అంబాజీపేట బెతస్థ చర్చి పాస్టర్ ఆనంద్(75) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు బుధవారం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు స్టంట్ వేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ లోగా గుండెపోటుకు గురై గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. భార్య అన్నపూర్ణ, ముగ్గురు కుమారులు ఉన్నారు. శుక్రవారం అంబాజీపేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బోర్డు ఇక్కడ.. కాలేజీ అక్కడ!

కొడిపల్లికి డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో విద్యార్థులు సంతోషపడ్డారు. దగ్గరలోనే ఉన్నత విద్య అందుతుందని ఆశపడ్డారు. అయితే వారి ఆశలు అడియాసలయ్యాయి. కొడిపల్లిలో భవనం అందుబాటులో లేకపోవడంతో నర్సాపూర్ (చింతకుంట)లో తరగతులు కొనసాగుతున్నాయి. ఓ వైపు దూరం భారం.. మరోవైపు సరిపడా బస్సులు లేక రెండేళ్లుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

- నర్సాపూర్(చింతకుంట)లో కొనసాగుతున్న కొడిపల్లి డిగ్రీ కళాశాల
- దూరభారంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



కొడిపల్లిలో ఉన్న డిగ్రీ కళాశాల బోర్డు

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఆనాటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కోరిక మేరకు గత ప్రభుత్వం 2023–24లో డిగ్రీ కళాశాలను మంజూరు చేసింది. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించింది. 50 మంది విద్యార్థులు అడ్మిషన్లు సైతం తీసుకున్నారు. అయితే కొడిపల్లిలో కళాశాలకు భవనం అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా నర్సాపూర్ (చింతకుంట) వద్ద గల డిగ్రీ కళాశాలలో తరగతులు ప్రారంభించారు. రెండేళ్లు అవుతున్నా ఇప్పటికీ కళాశాలను ఇక్కడికి తరలించలేదు. అయితే నర్సాపూర్ వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి కొడిపల్లికి వచ్చి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులలో నర్సాపూర్ వెళ్తున్నారు. దీంతో సమయం ఎక్కువ అవుతుండటం.. సమయానికి బస్సులు రాకపోవడంతో సకాలంలో తరగతులకు హాజరుకాలేక పోతున్నారు.

రెండుసార్లు వాయిదా..

కొడిపల్లిలో డిగ్రీ కళాశాల ప్రారంభించేందుకు అధికారులు రెండుసార్లు ప్రయత్నించారు. మొదట మాజీ ఎమ్మెల్యే భవనం కాంప్లెక్స్‌లో డిగ్రీ కళాశాల ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. బోర్డు సైతం ఏర్పాటు చేసినా, ఎందుకో వాయిదా పడింది. రెండోసారి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షిఫ్టింగ్ పద్ధతిలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధం కాగా, జూనియర్ కళాశాల విద్యార్థులు అడ్డుచెప్పారు. దీంతో మరోసారి వాయిదా పడింది. ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తి కావొస్తుండగా.. కొత్త సంవత్సరం ఆరంభంలోనైనా డిగ్రీ కళాశాలను అందుబాటులోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు. కాగా కొడిపల్లి బాలికల ఉన్నత పాఠశాల పక్కన బీసీ హాస్టల్ భవనం ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఇందులో 12 గదులు అందుబాటులో ఉన్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేస్తే సొంతభవనం నిర్మించే వరకు డిగ్రీ కళాశాలను ఇక్కడ ఏర్పాటు చేయవచ్చని పలువురు అంటున్నారు.

బస్సులు ఆపడం లేదు



లింగంపల్లి నుంచి కొడిపల్లికి బస్సులు లేకపోవడంతో ఆటోలో వెళ్తున్నాం. బస్‌లు ఫుల్‌గా వస్తుంటంతో చింతకుంట వద్ద ఆపడం లేదు. ఇంటికి వచ్చే వరకు రాత్రి అవుతుంది. ఒక్కోసారి మా నాన్న చింతకుంట వరకు బైక్‌పై వచ్చి ఇంటికి తీసుకెళ్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రవళి, విద్యార్థి లింగంపల్లి, కొడిపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కొడిపల్లి డిగ్రీ కళాశాల నర్సాపూర్ (చింతకుంట)లో కొనసాగుతుంది. లెక్చరర్లు సైతం ఉన్నారు. ఇక్కడి కళాశాల ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రెండుసార్లు కొడిపల్లిలో ప్రారంభించేందుకు ప్రయత్నించినా వాయిదా పడింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–డాక్టర్ దామోదర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వండి

నిజాంపేట(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెస్ అభ్యర్థి డా.పుట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురువారం నిజాంపేట మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆదేశాల మేరకు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంజా మహేందర్, మారుతి, నసీరుద్దీన్, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరి కోత సమయంలో జాగ్రత్త అవసరం

కొల్చారం(నర్సాపూర్): వరి కోతల సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకొని పంట నష్టం జరగకుండా చూసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సురేష్ సూచించారు. గురువారం మండలంలోని ఎనగండ్ల, పైతర, రంగంపేట, పోతంశెట్టిపల్లి రైతు వేదికల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి గింజలు పూర్తిగా గట్టిపడిన తర్వాతనే కోత కోయాలన్నారు. ధాన్యంలో తాలు, మట్టి పెడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ పుణ్యవతి, ఏఓ శ్వేతా కుమారి, ఏఈఓలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పెద్దశంకరంపేట(మెదక్): వరి కోత సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులు సూచించారు. గురువారం మండలంలోని రైతు వేదికలలో మండల వ్యవసాయ అధికారి కృష్ణ, జిల్లా సహకార అధికారి కరుణాకర్‌లు రైతులకు అవగహన కల్పించారు. పెద్ద శంకరంపేట, శివాయిపల్లి, రామోజీపల్లి రైతు వేదికలలో పంటలసాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఏఈవోలు మమత, అఖిల్, వినీత్, రైతులు పాల్గొన్నారు.



పోతంశెట్టిపల్లిలో మాట్లాడుతున్న డీఎస్ఓ సురేష్

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి

చిన్నశంకరంపేట(మెదక్): యాసంగి ధాన్యం కొనుగోలుకు నిర్వాహకులు సన్నద్ధం కావాలని తూప్రాన్ ఆర్‌డీఓ జయచంద్రారెడ్డి సూచించారు. గురువారం నార్సింగి మండల కేంద్రంతో పాటు శేరిపల్లి రైతు వేదికలో రైతులు, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ధాన్యం పండించిన తర్వాత ధాన్యం నేరుగా కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకురావాలని సూచించారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నార్సింగి ఎంపీడీఓ ఆనంద్, తహసీల్దార్ షేక్ కరీం, ఐకేపీ ఏపీఓ అశోక్, ఏఓ యాదగిరి, ఏఈఓలు విజృంభణ, దివ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

మున్సిపల్ కార్మికుల నిరసన

రామాయంపేట(మెదక్): తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికులు నిరసన చేపట్టారు. గురువారం సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులు కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. తమకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ కార్మికుల వేతనాలు, ఇతర సమస్యల విషయమై అధికారులు ఎంత మాత్రం పట్టించుకోడంలేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ దేవేందర్ నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన

వెల్దుర్తి(తూప్రాన్): మండల సమైక్య కార్యాలయంలో గురువారం వీఓఏ, గ్రామ సంఘం ఆఫీస్ బేరర్‌లు, గ్రామ సంఘం సబ్ కమిటీ మెంబర్లకు ఆరోగ్యం, పోషణ, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, జెండర్ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్భంగా ఆహారంతో ఆరోగ్యం, పోషకాలు నష్టపోకుండా వంట చేసే పద్ధతులు, పిల్లలు పోషణ, రక్త హీనత, చేతుల పరిశుభ్రత, సమతుల్య ఆహారం, పర్యావరణ పారిశుద్ధ్యం లాంటి అంశాలపై వివరించారు. స్వయం సహాయక సంఘాలు ప్రతినెలా సమావేశాలు నిర్వహించుకొని ఆయా అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు నవనీత, కార్యదర్శి ప్రమీల, కోశాధికారి శ్యామల, ఏపీఎం శంకరయ్య, సీసీలు, వైద్య సిబ్బంది కృష్ణవేణి, లలిత, అంగన్వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, వీఓఏలు, గ్రామ సంఘం ఆఫీస్ బేరర్లు, సబ్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ స్లిప్పుల పంపిణీ

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండలంలోని నార్లాపూర్ గ్రామంలో ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులకు ఓటర్ స్లిప్‌లను గురువారం ఆర్ఐ ఇమద్ అందజేశారు. గ్రామంలోని బీఎల్ఓకు ఎమ్మెల్సీ ఓటర్ల స్లిప్పులను అందజేసి తీసుకున్నట్లు సంతకాలు సేకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 27న నిర్వహించే పట్టభద్రుల ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందే..

మెదక్ మున్సిపాలిటీ: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ త్వరితగతిన పూర్తిచేయాలని, వ్యతిరేకిస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొంతమంది మాదిగలు ఉన్నత స్థానాల్లో ఉండి వర్గీకరణకు సహకరించకుండా వ్యతిరేకించడం దారుణం అన్నారు. వర్గీకరణ కోసం జరిగే పోరాటంలో దళిత ఇతర సామాజిక సంఘాల భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో లింగంపల్లి శ్రీనివాస్, చెట్లపల్లి యాదగిరి, మాసాయిపేట యాదగిరి మాదిగ, అస్తగల్ల బాలరాజు మాదిగ, మద్దూరి కృష్ణ మాదిగ, దండు సామెల్ మాదిగా, పాతూరు రాజు మాదిగ, కొలుపుల రామస్వామి మాదిగ, సాయిలు మాదిగ, మొక్క వినోద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో చిన్నారికి బంగారు పతకం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలలో ఓ చిన్నారి బంగారు పతకం సాధించి ప్రతిభ చాటింది. మండలంలోని జగ్గంపేటలోని నవభారతి పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న నీరుడి భవజ్ఞ ఈ నెల 18, 19వ తేదీలలో ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉష్ణ అండర్–12, మైనస్ 30 కిలోల విభాగంలో పాల్గొంది. ప్రతిభ చూపి బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ఆమెను ఘనంగా సన్మానించి బంగారు పతకం, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ చిన్న వయసులోనే భవజ్ఞ బ్లాక్‌బెల్ట్ సాధించడం ఎంతో హర్షించతగ్గదన్నారు.



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీకాంత్‌గౌడ్

ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

ఎఫ్ఎల్ఎన్ జిల్లా కో ఆర్డినేటర్ నిహిత్



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కొడిపల్లి(నర్సాపూర్): ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలని ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ) జిల్లా కో ఆర్డినేటర్ నిహిత్ తెలిపారు. గురువారం మండలంలోని సలాబత్‌పూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, మర్రిచెట్టుతండా పాఠశాలను ఎంఈఓ బాలరాజుతో కలిసి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి చతుర్విధ ప్రక్రియలు చదవడం, రాయడం, కూడికలు, గుణితం రావాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని తెలిపారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్, రాంసింగ్, హరీశ్వరీ, ఉపాధ్యాయులు గుండయ్య, తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డును ఎత్తివేయండి

నర్సాపూర్: డంప్‌యార్డును ఎత్తి వేయాలని జేఏసీ నాయకులు, ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును వ్యతిరేకిస్తూ నర్సాపూర్‌లో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాల్గొవ రోజుకి చేరాయి. గుమ్మడిదల జేఏసీ నాయకులు రిలే నిరాహార దీక్షల్లో పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ పాల్గొని మాట్లాడారు. డంప్‌యార్డుతో నర్సాపూర్‌లోని అడవులు, చెరువు కలుషితమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్యారానగర్ నుంచి డంప్‌యార్డును ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ మండలంలోని చాలా గ్రామాల ప్రజలు డంప్‌యార్డును వ్యతిరేకిస్తున్నారని, ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. రిలే దీక్షల్లో జేఏసీ నాయకులు రాజేందర్, సత్యం గౌడ్, నయిం, భిక్షపతి, బాల్‌రెడ్డి, దావుద్, రమణ రావు, మహ్మద్ , చిన్న అంజిగౌడ్, ఆంజనేయులుగౌడ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న గుమ్మడిదల జేఏసీ నాయకులు

వృథాగా నీరు.. పట్టించుకోరు

హవేళిఘణాపూర్(మెదక్): వేసవి సమీపిస్తుంటే నీటిని పొదుపు చేయాల్సిన అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మెదక్ మండలం చిట్యాలలో సింగిల్‌ఫేజ్ ద్వారా నీరు వృథాగా పోతుంది. రాబోయేది వేసవి కాలం కావడంతో నీరు ఆదా చేయాల్సిన అవసరం ఉంది. నీటి ఎద్దడి లేకుండా చూడాలి. ప్రత్యేకాధికారుల పాలనలో పర్యవేక్షణ లోపించడంతో పట్టించుకునేవారు లేక ఇలా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



చిట్యాలలో వృథా పోతున్న నీరు

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పొడిచన్‌పల్లి స్వయం పాలన దినోత్సవం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల పరిధిలోని పొడిచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌గా భవాని, డీఈఓగా చరణ్‌కుమార్, హెచ్‌ఎం అఖిల్, ఉపాధ్యాయులుగా స్వాతి, కీర్తి, భరత్, సృజన్ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఫాజిల్ హుస్సేన్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బి.తిమ్మాయిపల్లిలో..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బి.తిమ్మాయిపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠ్యాంశాలు బోధించారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం ప్రణీత్‌కుమార్, ఉపాధ్యాయులు పర్యవేక్షించి ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

లేబర్ బోర్డు కమిషనర్‌ను నియమించలేదు

భవన నిర్మాణ కార్మిక సంఘం నేత చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా నేటికీ లేబర్ బోర్డు కమిషనర్‌ను నియమించకపోవడం శోచనీయమని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం వాపోయారు. సిద్దిపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లేబర్ బోర్డు వద్ద రూ.2వేల కోట్ల నిధులు ఉన్నా కమిషనర్ లేకపోవడంతో ప్రమాదాలకు గురైన కార్మికులకు నిధులు కేటాయించుకునే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. కార్మికులు పడే కష్టాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, కార్మికులకు ప్ర మాదాలు జరిగితే తక్షణ మే బీమా వర్తింప చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పట్ల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లా డడంపై హర్షం వ్యక్తం చేశారు. సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించే విధంగా చొరవ చూపాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మార్చి 18న బ్రాహ్మణ సంఘం ఎన్నికలు



తూప్రాన్: జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు వచ్చే నెల 18న తూప్రాన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఎన్నికల ప్రధానాధికారి సోమయాజుల రవీంద్రశర్మ, సహాయ ఎన్నికల అధికారి శాస్త్రుల మధుశ్రీ శర్మ, డీజీ శ్రీనివాసశర్మ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సన్నాహక సమావేశంలో తూప్రాన్, నర్సాపూర్, మెదక్ డివిజన్లకు సంబంధించిన ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. ఇప్పటికే జిల్లా అధ్యక్షుడిగా శలాక రాజేశ్వరశర్మ ఎన్నికైనట్లు చెప్పారు. ప్రతి బ్రాహ్మణుడు సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.

◆ బీజేపీ ఇంటింటి ప్రచారం

చిలప్‌చెడ్(నర్సాపూర్): పట్టాభద్రుల నియోజకవర్గ ఎమెల్సీ ఎన్నికల్లో బీజేపీ పట్టాభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలను గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు నగేష్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో బీజేపీ నాయకులతో కలసి ఇంటింటికి తిరుగుతూ మొదటి ప్రాధాన్యత ఓటు అంజిరెడ్డికి వేయాలని ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థులు గెలిస్తేనే పట్టాభద్రులకు ఉపాధి, సంక్షేమం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, వెంకటేశం, దశరథ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ హార్డ్‌వేర్ షాపులో చోరీ

కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లిలోని హిమాలయ ఎలక్ట్రికల్ అండ్ హార్డ్‌వేర్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం బాధితుడు కుమరం మోహన్‌చౌదరి కథనం ప్రకారం.. రోజుమాదిరిగా బుధవారం రాత్రి షాపునకు తాళం వేసి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చేసరికి షాపు షెట్టర్ తాళం పగులగొట్టి ఉంది. రూ. 80వేల విలువచేసే వివిధ రకాల వైర్‌బెండల్స్, గల్లపెట్టెలో నుంచి రూ 15వేలు నగదు చోరీ అయినట్లు వాపోయాడు. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని ఎస్ఐ రంజిత్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

◆ బీజేపీ అభ్యర్థికి మద్దతివ్వండి

నర్సాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ కోరారు. గురువారం ఆయన పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు నగేష్, శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ రూ.4 లక్షలతో పులిహోర మిషన్‌లు అందజేత



పాపన్నపేట(మెదక్): వేడి వేడి పులిహోర 45 నిమిషాల్లో భక్తులకు అందించేందుకు నలుగురు భక్తులు రూ.4 లక్షల మిషన్ ను ఏడుపాయల దుర్గమ్మ ఆలయానికి వితరణ చేశారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి కథనం మేరకు.. హైద్రాబాద్‌కు చెందిన నలుగురు అన్నాదమ్ముళ్లు పులిహోర మిషన్‌ను అందజేశారు. నాలుగు బ్రాయిలర్‌లు, ఒక కుక్కర్ గల ఈ మిషన్‌లో క్వింటాల్ బియ్యం మొత్తం 45 నిమిషాల్లో పులిహోరగా మారుతుందని తెలిపారు.

◆ చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి

నర్సాపూర్: మార్చిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చేవేళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం అమలు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి కోరారు. దళితుల సమగ్ర అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మండలస్థాయిలో కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264